కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :135 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 12-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## వీఆర్ఏలకు న్యాయం చేస్తాం : పొంగులేటి



హైదరాబాద్,గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు వీఆర్ఏలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అసెంబ్లీలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తావించారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అర్ధరాత్రి నిర్ణయాలతో వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థలను రద్దు చేసి రెవెన్యూ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో భూముల పరిరక్షణతో పాటు ప్రజలకు సేవలందించిన రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు.

61 ఏళ్లు నిండిన వీఆర్ఏలపై దృష్టి

61 ఏళ్లు నిండిన వీఆర్ఏల పునరుద్ధరణ అంశంపై ప్రస్తుతం సాంకేతికపరమైన చిక్కులను పరిశీలిస్తున్నామని పొంగులేటి తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. వీఆర్ఏలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం వంద శాతం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై.. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి షాకింగ్ కామెంట్స్..?



హైదరాబాద్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరి వ్యక్తులు చూస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రితో నాకు అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని, మంచి జరిగితే మంచి అని.. చెడు జరిగితే చెడు అని చెప్పడం నా నైజం అని రాజగోపాల్ రెడ్డి అన్నారు.

నాపై ప్రచారం..

మంత్రి పదవి కోసం నేను రేవంత్ రెడ్డి దగ్గర కాంప్రమైజ్ అయినట్లు కొందరు నాపై ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్టానం రేవంత్ రెడ్డి కాదని అన్నారు. మంత్రి పదవి ఇస్తానని మాట ఇచ్చింది అధిష్టానం అధిష్టానం ఏమీ చెప్తే నేను అది చెయ్యడానికి నేను సిద్ధంగా ఉన్నానని ఆయన క్లారిటీ ఇచ్చారు. నిదుల కోసం సీఎంను కలిస్తే తప్పేంటి అభివృద్ధి జరగాలంటే సీఎం, డిప్యూటీ సీఎంను కలవాల్సిందనని అన్నారు.

చెప్పుకోవడంలో తప్పులేదు..

కలిస్తే కంప్రమైజ్ కలువకపోతె గ్యాప్ పెరిగిందని ప్రచారం చేస్తారా అంటూ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నభిప్రాయం ఉండటం సహజం కానీ కొండా సురేఖ విషయంలో సీఎం రేవంత్ హర్ట్ అయి ఉంటారు. సీఎంగా వీక్ అయితానని అధిష్టానంతో భాధతో చెప్పుకొని ఉంటారని కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం కొండా పై అధిష్టానానికి చెప్పుకోవడంలో తప్పేమి లేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షలు ఇచ్చేది చిన్న అమౌంట్ ఏమీ కాదని రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

## విద్యార్థులు,సిబ్బంది ఇక్కట్లు : అక్బరుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, వేలాది మంది కాలేజీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంఐఎం శాసనసభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. అసెంబ్లీలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యాసంస్థల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నారు. బకాయిల కారణం గా కొన్ని కాలేజీలు సిబ్బందికి జీతాలు చెల్లించలేకపోతున్నాయని, ఫలితంగా కాలేజీలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సభ దృష్టికి తీసుకెళ్లారు.

'నా ప్రశ్నను ఎందుకు వాయిదా వేశారు?'

తన ప్రశ్నకు సమాధానం పొందేందుకు అవకాశం ఇవ్వకుండా ఇతర ప్రశ్నలపై గంటల తరబడి చర్చ జరిపి, తన ముఖ్యమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రశ్నను వాయిదా వేయడంపై అక్బరుద్దీన్ ఒవైసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు, విద్యాసంస్థలకు సంబంధించిన ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని కోరారు.

## సోలార్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని రైతులు అందిపుచ్చుకోవాలి



హైదరాబాద్: రాష్ట్రంలో ఏటా విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. పవన, బయోమాస్, వేస్ట్ టు ఎనర్జీ విషయంలో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని, హైబ్రిడ్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ, రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులుస్పష్టమైన మార్గదర్శకాలని అన్నారు. 5వ రోజు తెలంగాణ అసెంబ్లీ శాసనమండలి సమావేశాల్లో భట్టి ప్రసంగించారు. 2023లో 15 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండేదని, 2026 సెప్టెంబర్ 9 నాటికి 19 వేల మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ పెరిగిందని తెలియజేశారు. ఈ ఏడాది చివరినాటికి 20 వేల మెగావాట్లకు పైగా విద్యుత్ డిమాండ్ ఉందని, విద్యుత్ డిమాండ్ మేరకు కన్వెన్షల్, నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ ఉత్పత్తి జరుగుతుందని అన్నారు. తెలంగాణ క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకువచ్చామని, పంప్డ్ స్టోరేజీ డిపిఆర్ తయారీకి దాదాపు రెండేళ్లు పడుతుందని చెప్పారు.రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ ఏర్పాటుకు 10 సంస్థలు ఆసక్తి చూపాయని, పిఎం కుసుమ్ కింద విద్యుత్ విషయంలో రైతులు ముందుకు వచ్చారని భట్టి పేర్కొన్నారు. పిఎం కుసుమ్ కింద కేంద్ర సబ్సిడీతో పాటు రాష్ట్రం కొంత భారం భరిస్తోందని, పైలట్ ప్రాజెక్టు కింద గ్రామాల్లో ఇప్పటికే అమలవుతోందని అన్నారు. 81 గ్రామాల్లో వ్యవసాయ పంపు సెట్లను సోలార్ గా మార్చే చర్యలు చేపట్టామని, మన్ననూరులో పూర్తిగా సోలార్ మార్చి ప్రారంభించామని భట్టి అన్నారు. సోలార్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని రైతులు అందిపుచ్చుకోవాలని ఏటా ఆర్థికశాఖ 29లక్షల పంపుసెట్లకు రూ. 14వేల కోట్లే చెల్లిస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కింద 53 లక్షల ఇళ్లకు రూ. 5వేల కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. ఇవే డబ్బులను సోలారైజేషన్ కోసం ఖర్చు చేస్తే ఖజానాపై భారం తగ్గుతుందని, పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో సోలార్ విద్యుత్ రాత్రి వినియోగానికి చర్యలు జరుగుతున్నాయని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## పక్కా వ్యూహంతో కాంగ్రెస్...



హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకునే రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ టాప్ లీడర్‌షిప్ నే లక్ష్యంగా చేసుకుంటాయనే విషయం మరోసారి రుజువైంది. గత మూడు రోజులుగా తెలంగాణ శాసనసభ లోపల, బయట చోటుచేసుకున్న రచ్చ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ గేట్ వద్ద పోలీసులతో జరిగిన తోపులాటలు కేవలం కొందరు ఎమ్మెల్యేల తొందరపాటు చర్య కాదని సీఎం రేవంత్ శాసనసభ వేదికగా బాంబు పేల్చారు. ఈ మొత్తం హైడ్రామా వెనుక ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన నేరపూరిత కుట్ర ఉందంటూ, నేరుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నే సూత్రధారిగా వేలెత్తి చూపడం ద్వారా గులాబీ దళానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం కేవలం ఒక రాజకీయ విమర్శ మాత్రమే కాదు. దానికి పక్కా లీగల్ అండ్ పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అంతర్గత సమావేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మార్కును, అసెంబ్లీ సమావేశాలను అడ్డుకోవడానికి ప్లాన్ సిద్ధమైందని రేవంత్ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, పోలీసుల విధులకు భంగం కలిగించడం వెనుక సభను అస్థిరపరిచే పక్కా వ్యూహం ఉందన్నారు. దీనిని కేవలం సభా నిబంధనల ఉల్లంఘనగా కాకుండా, ఎఖఅ, ఃఔ కింద నేరపూరిత కుట్రగా పరిగణిస్తూ దర్యాప్తుకు ఆదేశించడం కాంగ్రెస్ వేసిన మాస్టర్ స్ట్రోక్. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం లీగల్‌గా సీరియస్‌గా తీసుకుంది. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో విచారణ జరిపించి, ఫామ్‌హౌస్ సమావేశానికి హాజరైన నేతలు, అక్కడి నుంచి వచ్చిన సూచనలు, అసెంబ్లీ వద్ద జరిగిన భౌతిక దాడుల మధ్య ఉన్న లింకులను టెక్నికల్, ఫోరెన్సిక్ ఆధారాలతో సేకరించాలని ఆదేశించారు. సీనియర్ ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగే ఈ కుట్ర కోణం దర్యాప్తు.. రేపు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే వరకూ వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్‌ను లేదా ఆయన ప్రధాన అనుచరులను విచారిస్తే, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడటం ఖాయం.కాంగ్రెస్ సర్కార్ వేసిన ఈ బిగ్ ట్రాప్ నుంచి బయటపడటం బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలే. బీఆర్ఎస్ ఇప్పటికే ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు లీగల్ , విక్టిమ్ కార్డ్‌ను వాడుతోంది. అసెంబ్లీ గేట్ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల, సీనియర్ నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టును, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి పోలీస్ యంత్రాంగాన్ని రక్షణలో పడేసే ప్రయత్నం చేస్తోంది. రేవంత్ రెడ్డి కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ పేరును లాగుతున్నారని బీఆర్ఎస్ వాదిస్తోంది. రేవంత రెడ్డి ఆడిన ఈ గేమ్‌తో ప్రతిపక్షం అనుకున్న అజెండా పూర్తిగా దారి తప్పింది. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలు , ఆరు గ్యారెంటీలు అంశాలపై చార్జ్‌షీట్ ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావించిన బీఆర్ఎస్.. ఇప్పుడు కేసీఆర్ కుట్ర – దళిత స్పీకర్‌కు అవమానం అనే కొత్త కాంగ్రెస్ నెరేటివ్‌ను డిఫెండ్ చేసుకునే పనిలో పడింది. కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీల సస్పెన్షన్ల చుట్టూ తిరిగిన చర్చను రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో నేరుగా కేసీఆర్ వర్సెస్ కాంగ్రెస్ సర్కార్ గా మార్చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయాల్లో చిన్న చిన్న నేతలతో కాలక్షేపం చేయకుండా, నేరుగా ప్రధాన ప్రత్యర్థి మూలాలనే దెబ్బకొట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. విచారణ పేరుతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ఈ కేసులోకి లాగడం ద్వారా బీఆర్ఎస్ అగ్రనాయకత్వాన్ని మానసికంగా, లీగల్‌గా ఒత్తిడికి గురిచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించింది. రాబోయే రోజుల్లో ఈ సీనియర్ ఐపీఎస్ విచారణ ఏ మలుపు తిరుగుతుందో, గులాబీ దళం దీనికి ఎలా బదులిస్తుందో వేచి చూడాలి.

## డేటా కేంద్రాలతో దూకుడు.. విమానాశ్రయాలతో వికాసం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, డిజిటల్ విప్లవం శరవేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో సాంకేతిక రంగానికి వెన్నెముకగా నిలిచే డేటా కేంద్రాలను కాదనుకుంటే కలిగే పర్యవసానాలేంటి? ద్వితీయ శ్రేణి నగరాలకు విమానయాన సదుపాయం విస్తరిస్తే రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారబోతోంది? హైదరాబాద్ వేదికగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలక విషయాలను వెల్లడించారు. డేటా సెంటర్ల ప్రాధాన్యతను, ప్రాంతీయ అనుసంధానతను ఆయన సమగ్రంగా వివరించారు:ఉపాధి కల్పనకు ఊతం: ఒక్కో డేటా సెంటర్ ఏర్పాటుతో దాదాపు 7 వేల మంది నిరుద్యోగులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ కేంద్రాలను మనం తిరస్కరిస్తే పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతారని, అవకాశాలను ఒడిసిపట్టడంలో 'మీనమేషాలు లెక్కిస్తే' భావితరాలకు తీరని నష్టం జరుగుతుందని హెచ్చరించారు.ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టులు: రాష్ట్ర సమగ్ర పారిశ్రామిక వికాసానికి రవాణా వ్యవస్థ ప్రాణవాయువు వంటిదని మంత్రి పేర్కొన్నారు. వరంగల్ (మామునూరు) విమానాశ్రయం సాకారం కావడంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. అదే బాటలో వెనుకబడిన ఆదిలాబాద్‌లోనూ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు.పరిశ్రమల వికేంద్రీకరణ, మౌలిక వసతుల పెంపుతోనే తెలంగాణను పారిశ్రామికంగా అగ్రగామిగా నిలపగలమని మంత్రి పునరుద్ఘాటించారు.

## అసెంబ్లీ వద్ద అవమానం... సబితా ఇంద్రారెడ్డి ఆవేదన



హైదరాబాద్,ప్రజాస్వామ్య దేవాలయం ముంగిట మహిళా ప్రతినిధులకే రక్షణ కరువైందా శాసనసభ ప్రాంగణంలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల భద్రతా సిబ్బంది ప్రవర్తించిన తీరు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. అసెంబ్లీ వద్ద తమకు జరిగిన అవమానం పెను వేదనకు గురిచేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుట్రపూరిత నిర్బంధం: శాసనసభ సమావేశాల తొలిరోజే సభకు వెళ్తున్న తమను అడ్డుకుంటూ పోలీసులు కృత్రిమంగా యుద్ధ వాతావరణాన్ని సృష్టించారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. మహిళా శాసనసభ్యుల పట్ల కొందరు సిబ్బంది అత్యంత అభ్యంతరకరంగా, కీచకుల్లా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. ఇది కేవలం అనుకోకుండా జరిగిన ఘటన కాదని, పక్కా వ్యూహంతో చేపట్టిన రాజకీయ కుట్రలో భాగమేనని ఆమె విమర్శించారు.సభలో గొంతు నొక్కేశారు: ఈ అమానవీయ ఘటనపై శాసనసభలో ప్రస్తావించేందుకు కనీసం ఒక్క నిమిషం కూడా సమయం కేటాయించకపోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని ఆమె పేర్కొన్నారు. స్పీకర్‌తో పాటు ముఖ్యమంత్రి, శాసనసభ వ్యవహారాల మంత్రి స్పందిస్తారని భావించినా నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్రంలో న్యాయం లభించని పరిస్థితుల్లోనే ఢిల్లీకి వెళ్లి జాతీయ మహిళా కమిషన్ , జాతీయ మానవ హక్కుల కమిషన్ లకు లిఖితపూర్వకంగా ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామని, ఈ పోరాటాన్ని ఇంతటితో ఆపే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో రోజుకు రూ.8-12 లక్షల ఖర్చు..

హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. 6 రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. అంటే.. ఈ గురు, శుక్ర, శనివారంతో ఈ సభలకు ముగింపు పలకనున్నారు. కీలకమైన బిల్లులను ఈ సభలో ప్రవేశ పెట్టి ఆమోదించుకోవాలని ప్రభుత్వం పక్షం నిర్ణయించుకుంది. అలాగే.. వెయ్యిరోజుల పాలన పై కూడా చర్చించి.. ప్రజలకు ఏయే మేళ్లు చేశారు.. ఏమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.. అనే విషయాలను కూడా వివరించాలని నిర్ణయించారు. అజెండాలోనూ వీటిని పేర్కొన్నారు.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ విషయానికి వస్తే.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను.. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, హైడ్రా కమిషనర్ వ్యవహారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎల్ నినో ప్రభా వం సహా.. ఇతర అంశాలను కూడా ప్రస్తావించాల ని నిర్ణయించుకు ంది. తద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావా లని తొలుత నిర్ణయించింది. కానీ, అనూహ్యంగా అసెంబ్లీ వాతావరణమే మారిపోయింది. మూడు రోజుల అసెంబ్లీలో ఒక్కటంటే ఒక్క సమస్య కూడా ప్రస్తావనకురాలేదు. అటు అధికార పక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షాలు ఒకరిపై



## సంపాదకీయం

**శనివారం 12-09-2026**

# ఆత్మహత్యల నివారణ సాధ్యమే

ప్రతి జీవితం ఎంతో విలువైనది. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడుతూ అర్ధంతరంగా జీవితాలను ముగిస్తున్నారు. అలాంటి వారిని సరైన సమయంలో గుర్తించి, చికిత్సతో పాటు మానవీయ తోడ్పాటును అందించగలిగితే బలవన్మరణాలను నివారించవచ్చు. వారి కుటుంబాలను నిత్యశోకం నుంచి తప్పించవచ్చు. ఆత్మహత్యను కేవలం మానసిక సమస్యగానే చూడకూడదు, దీన్ని తీవ్రమైన ప్రజారోగ్య, సామాజిక, ఆర్థిక, అభివృద్ధి సంబంధిత సవాలుగా గుర్తించాల్సిన అవసరముంది. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా...ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, ఏటా ఏడు లక్షల మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆ లెక్కన, ప్రతి 43 సెకన్లకు ఒకరు బలవన్మరణానికి పాల్పడుతున్నారన్న మాట. ఇలాంటి వారిలో సుమారు 73శాతం మంది అల్ప, మధ్య ఆదాయ దేశాలకు చెందినవారు; 56శాతం మంది యాభై ఏళ్లలోపు వారే. మరింత విస్తుగొలిపే విషయం, ఆత్మహత్యల విషయంలో 15-29 ఏళ్ల యువత మూడో స్థానంలో ఉండటం! 2024లో భారత్‌లో 1.70లక్షల మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడినట్లు జాతీయ నేర గణాంకాల సంస్థ నివేదిక వెల్లడించింది. నమోదు లోపాలు, మరణాలను తప్పుగా వర్గీకరించడం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే, వాస్తవ సంఖ్య మరింత ఎక్కువే ఉంటుంది. ఆత్మహత్య అనేది ఒక్క కారణంతోనే సంభవించదు. కుంగుబాటు(డిప్రెషన్), బైపోలార్ డిజార్డర్‌కు తోడు మద్యం లేదా మాదక ద్రవ్యాల వినియోగం, నిరుద్యోగం, అప్పులు, కుటుంబ సమస్యలు, దీర్ఘకాలిక అనారోగ్యం, చదువుల ఒత్తిడి, ఒంటరితనం, హింస, వేధింపులు, సామాజిక నిరాదరణ వంటివి బలవన్మరణానికి ప్రేరేపిస్తాయి. గతంలో ఆత్మహత్యాయత్నం చేసి ఉండటాన్ని ముఖ్యమైన హెచ్చరిక సంకేతంగా భావించి, బాధితులకు సరైన చికిత్స అందించాలి.

### నిరంతర పర్యవేక్షణ అవసరం

ఆత్మహత్యలను నివారించవచ్చని, ఇది సాధ్యమేనని అనేక దేశాలు నిరూపించాయి. మానసిక ఆరోగ్య సేవలను విస్తరించడం, వైద్యులకు మెరుగైన శిక్షణ ఇవ్వడం, డిప్రెషన్‌ను ముందుగా గుర్తించడం ద్వారా ఫిన్లాండ్ ఈ విషయంలో విజయం సాధించింది. ప్రమాదకర పురుగు మందులను నియంత్రించడం ద్వారా శ్రీలంక; చట్టపరమైన చర్యలూ సామాజిక కార్యక్రమాలు, హెల్ప్‌లైన్లు, ఉద్యోగ-ఆర్థిక సహాయక వ్యవస్థల ద్వారా జపాన్ ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించాయి. భారతదేశంలో జాతీయ ఆత్మహత్య నివారణ వ్యూహం-2022, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-2017 ముఖ్యమైన ముందడుగులు. అయితే, ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని నేరస్థుడిగా కాకుండా, తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తిగా గుర్తించాలి. విధానాల సమర్థ అమలుకు ప్రత్యేక నిధులు, స్పష్టమైన బాధ్యతలు, నిరంతర పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలి. ముఖ్యంగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించి ఆరా తీయాలి. ప్రతి జిల్లా ఆసుపత్రిలో శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య నిపుణులు, అత్యవసర కౌన్సెలింగ్ సదుపాయాలను అందుబాటులో ఉంచాలి. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తికి ఆ తర్వాత సమగ్ర మానసిక, సామాజిక మూల్యాంకనం, చికిత్స, భద్రతా ప్రణాళిక, కుటుంబ కౌన్సెలింగ్, నిరంతర ఫాలోఅప్ తప్పనిసరి. పాఠశాలలు, కళాశాలల్లో భావోద్వేగ సామర్థ్యాలు, జీవన నైపుణ్యాలు, ఒత్తిడి నిర్వహణ, సమస్యా పరిష్కారం తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. సాయం అవసరమైన వారికి గోప్యంగా కౌన్సెలింగ్ అందించాలి. విద్యార్థులు ఎవరైనా కుంగుబాటు వంటి లక్షణాలతో బాధపడుతుంటే, వెంటనే గుర్తించేలా ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లకు శిక్షణ అందించాలి. కార్యాలయాల్లో బర్నౌట్, మద్యం-మాదకద్రవ్యాల వినియోగం, కుటుంబ, ఆర్థిక సమస్యలతో ఎవరైనా బాధపడుతున్నట్లు తెలిస్తే వెంటనే గోప్యతతో కూడిన సాయం అందించాలి. వ్యాకులత, ఆత్మహత్య ఆలోచనలు కలిగిన రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు మానసిక ఆరోగ్య సేవలతో పాటు ఆర్థిక సాయాన్నీ అందించాల్సిన అవసరముంది. బలవన్మరణాల నివారణలో ప్రమాదకర పురుగుమందుల నియంత్రణ, వంతెనల వంటి ప్రదేశాల్లో భద్రతా చర్యలు చేపట్టడం ముఖ్యమైనవి. అధిక ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించడం, అత్యవసర కాల్స్‌కు ప్రాధాన్యమివ్వడం, ఫాలోఅప్, పర్యవేక్షణకు ఏఐ సాంకేతికత తోడ్పడగలదు. కానీ ఇదేమీ వైద్యుల సేవలు, ఇతరుల మానవీయ పలకరింపులకు ప్రత్యామ్నాయం కాదు.

### కుటుంబాల భవిష్యత్తుకు పెట్టుబడి

ఆత్మహత్యల నివారణలో సీబీటీ-ఎస్‌పీ, డీబీటీ, సీఏఎంఎస్, సేఫ్టీ ప్లానింగ్ వంటి మానసిక చికిత్సలు ఎంతో ప్రయోజనకరమైనవి. అయితే చికిత్సను రోగి పరిస్థితి, వ్యాధి నిర్ధారణ, ప్రమాదస్థాయిని బట్టి నిపుణులే నిర్ణయించాల్సి ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం- ఆత్మహత్య పద్ధతులు, మృతదేహాల చిత్రాలు, బలవన్మరణాలకు సంబంధించి సంచలనాత్మకమైన కథనాలను ఎక్కడా ప్రచారం చేయకూడదు. ఎప్పుడైనా ఆత్మహత్యలకు సంబంధించిన కథనాలను ప్రచురించేటప్పుడు వాటితోపాటే సహాయక సేవలు, హెల్ప్‌లైన్ వివరాలను ఇవ్వాలి. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, డిజిటల్ కంటెంట్‌లో ఈ అంశాలను శాస్త్రీయంగా, సున్నితంగా చిత్రీకరించేందుకు మానసిక వైద్యుల సూచనలు సలహాలు ఎంతైనా అవసరం. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి సంస్థలు ఆత్మహత్యలపై అవగాహన, వైద్యుల శిక్షణ, స్క్రీనింగ్, రిఫరల్ సేవలు, విధాన రూపకల్పనలో ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలి. ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక బడ్జెట్, జిల్లాస్థాయి సేవల విస్తరణ, అన్ని భాషల్లో 24 గంటల హెల్ప్‌లైన్‌తో పాటు పరిశోధన-పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. ఇందుకయ్యే ఖర్చును మానవ వనరుల సంరక్షణ, కుటుంబాల భవిష్యత్తు, దేశాభివృద్ధి కోసం వెచ్చించే పెట్టుబడిగా చూడాలి. ఏదిఏమైనా, ఆత్మహత్యలను నివారించవచ్చని శాస్త్రీయ ఆధారాలు అత్యంత స్పష్టంగా చెబుతున్నాయి. సరైన చికిత్సకు కరుణతో కూడిన సామాజిక స్పందన, రాజకీయ సంకల్పం, సమగ్ర విధానాలు, బాధ్యతాయుతమైన మీడియా తోడైతే మన దేశంలో ఆత్మహత్యలు గణనీయంగా తగ్గుముఖం పడతాయి. ఆ మేరకు పకడ్బందీ చర్యలు తీసుకోవడానికి ఇదే సరైన సమయం.

# కురుక్షేత్రం.. వైసీపీకి శ్రీకృష్ణుడు కావాలి!



అమరావతి,భీకరమైన పోరు అని చెప్పడానికి కౌరవులు, పాండవుల మధ్య సాగిన కురుక్షేత్ర సమరాన్ని పోలుస్తుంటారు. కురుక్షేత్ర సమయంలో అంతిమంగా పాండవులదే విజయం. రణస్థలిలో పాండవుల వీరోచిత పోరాటం కంటే, వారి వ్యూహాలు విజయానికి దారి తీశాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి, వైసీపీ మధ్య సాగే ఫైట్‌ను కురుక్షేత్ర సమరంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ పోలుస్తుంటారు.సార్వత్రిక ఎన్నికల్లో కూటమిని ఎదుర్కోవడం అంత ఈజీ కాదని జగన్‌కు అవగాహన వుండడం మంచి పరిణామం. ప్రత్యర్థుల్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు. అలా ఎవరైనా అంచనా వేస్తే, ఓటమికి తనకు తానే బీజం వేసుకున్నట్టుగా భావించాల్సి వుంటుంది. జగన్ విషయానికి వస్తే, తన రాజకీయ ప్రత్యర్థులు మామూలోళ్లు కాదని తన వాళ్లకు పదేపదే చెబుతున్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ తాము కూటమిగానే వస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ ప్రకటించాయి. ఒకవేళ చిన్నచిన్న విభేదాలున్నా, వాటిని సరిచేసుకుంటామని ఆ మూడు పార్టీల నాయకులు చెబుతున్నారు. వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీని ఎదుర్కోవాలంటే, మూడు పార్టీలు కలిసి వుంటే తప్ప, ఎవరికి వారుగా సాధ్యం కాదని కూటమి నేతల్లోనూ స్పష్టత వుంది. దీంతో పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య బలాబలాల విషయంలో ఎవరికీ తక్కువ అంచనాలు లేవు.వైఎస్ జగన్ విషయానికి వస్తే, కేవలం కురుక్షేత్ర సమరంతో పోల్చితే సరిపోదు. కురుక్షేత్ర సమరం వైసీపీకి ఒక గుణపాఠం. సింగిల్‌గానే వెళ్తాం, సింహం- సింగిల్ లాంటి సినిమా డైలాగ్‌లని వైసీపీ నేతలు చెబుతుంటారు. యుద్ధంలో గెలిచిన వారు రాసిందే చరిత్ర. ఓడిపోయిన వాళ్లకు చరిత్ర వుండదనే చేదు నిజాన్ని వైసీపీ జీర్ణించుకోవాలి. వీరమరణం పొందడానికే యుద్ధం చేస్తామని వైసీపీ నేతలు చెబితే, చేయగలిగేదేమీ వుండదు.కురుక్షేత్ర సమరానికి పాండవులు అన్ని రకాల అస్త్రశస్త్రాలు, వ్యూహాలతో వెళ్లడం వల్లే విజయం సాధించారు. ఒక్క మాటలో చెప్పాలంటే , ఎంతటి వీరులైనా, వినయం కూడా ఎంతో అవసరమని పాండవులు ప్రతి సందర్భంలోనూ నిరూపించారు. పాండవులకు రాజ్యంలో భాగం ఇవ్వడానికి దుర్యోధనుడు ససేమిరా అంటారు. చివరికి ఐదు ఊళ్లైనా ఇవ్వాలని శ్రీకృష్ణుడు రాయబారం నడిపితే, కాదు, కుదరదని దుర్యోధనుడు తిరస్కరించి పంపుతారు. దీంతో కురుక్షేత్ర సమరం తప్పలేదు. ఈ నేపథ్యంలో పాండవులు యుద్ధంలో గెలవడానికి వ్యూహాలకు పదును పెడతారు. అర్జునుడి రథసారథిగా శ్రీకృష్ణుడిని ఎంచుకోవడంలోనే పాండవుల విజయం నమోదైంది. యుద్ధంలో ఆయుధం పట్టనని ముందే పాండవులకు శ్రీకృష్ణుడు తేల్చి చెబుతారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులు, మద్దతు వుంటే చాలు,ఆయన యుద్ధం చేయకపోయినా గెలుస్తామని పాండవులకు బాగా తెలుసు.కురుక్షేత్ర సమరం ప్రారంభం అవుతుంది. కౌరవుల పక్షాన నిలిచిన యోధానుయోధులైన భీష్ముడు, గురువులు ద్రోణాచార్యుడు, కృపాచార్యుల వద్దకు ధర్మరాజు వెళ్లి, ఆశీస్సులు కోరుతారు. ఆ సమయంలో దుర్యోధనుడు తీవ్రస్థాయిలో తన తాత భీష్ముడు, గురువులపై విరుచుకుపడతారు. అప్పుడు దుర్యోధనుడిపై భీష్ముడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీవు వెళ్లి, ఆశీస్సులు కోరితే ధర్మరాజు తప్పక అందజేస్తారని హితవు చెబుతారు. పెద్దాచిన్నా, గురువు దైవం అంటే ఏంటో ధర్మరాజుని చూసి నేర్చుకోవాలని దుర్యోధనుడికి భీష్ముడు చీవాట్లు పెడతారు.ఇదే సందర్భంలో చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేసిన భీష్మ పితామహుడు, అలాగే విద్యాబుద్ధులు నేర్పిన ద్రోణ, కృపాచార్యులు, తోడబుట్టిన కౌరవుల పిల్లల్ని, వారి వెంట ఉన్న సైన్యాన్ని చూసి ...యుద్ధంలో ఇంత మందిని చంపి, ఏం సాధించాలని ప్రశ్నిస్తూ, యుద్ధం చేయనని రణస్థలిలో అర్జునుడు మొండికేస్తారు. అప్పుడే శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తారు. అర్జునా ....నువ్వు నిమిత్తమాత్రుడవని శ్రీకృష్ణుడు అంటారు. నీ కర్తవ్యాన్ని మాత్రమే నిర్వర్తించాలని హితబోధ చేస్తారు.యుద్ధం చేయనని మొండికేసిన అర్జునుడికి నాడు శ్రీకృష్ణుడు చేసిన గీతోపదేశం... ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచానికి గొప్ప మోటివేషన్. గీతోపదేశం వింటే చాలు మనిషిలో తెలియకుండా ఒక శక్తి ఆవహిస్తుంది. అందుకే యుద్ధమే చేయనని మొండికేసిన అర్జునుడు సైతం.... గీతోపదేశం విన్న తర్వాత, ఆ మహానుభావుడి విశ్వరూపం చేసి, ఆరాధించి, కురుక్షేత్ర సమరంలో యుద్ధానికి సమాయత్తం అవుతారు.అలాగే భీష్ముడిని అంతమొందించడానికి శిఖండిని, గురువైన ద్రోణిని చంపడానికి ఏనాడూ అబద్ధాలు చెప్పని ధర్మరాజుతో "అశ్వత్థామ హతః.. కుంజరః" అని శ్రీకృష్ణుడు చెప్పిస్తారు. ఆ మాట విని ద్రోణుడు శక్తిహీనుడైతే, పాండవుల సేనాధిపతి ధృష్టద్యుమ్నుడు నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. అలాగే కర్ణుడి దగ్గరికి తల్లి కుంతిని పంపి, తన కుమారులకు ప్రాణభిక్ష పెట్టాలని అడిగేలా శ్రీకృష్ణుడు చక్రం తిప్పుతారు. అప్పటికి కర్ణుడికి కుంతి మీ తల్లి అని శ్రీకృష్ణుడు వ్యూహాత్మకంగా చెప్పి వుంటారు.శరణుకోరి వచ్చిన తల్లికి కర్ణుడు అభయం ఇస్తారు. మీకు ఐదుగురే బిడ్డలుంటారని, ఒక్క అర్జునుడు తప్ప, మిగిలిన నలుగురిని ఏమీ అనని కుంతికి కర్ణుడు మాట ఇస్తారు. అలాగే భీష్ముడు, ద్రోణుడు యుద్ధం చేసే సమయంలో కర్ణుడు రణస్థలంలో దిగకుండా, చేయడంలో శ్రీకృష్ణుడు వ్యూహం రచిస్తారు.కర్ణుడి వద్ద అత్యంత శక్తిమంతమైన ఆయుధాల్ని భీముడు కుమారుడైన ఘటోత్కచుని చంపడానికి వాడుతారు. తద్వారా అర్జునుడికి ఏమీ కాకుండా శ్రీకృష్ణుడు తన తెలివితేటలతో లైన్ క్లియర్ చేస్తారు. కురుక్షేత్ర సమరం నుంచి యుద్ధంలో గెలవడానికి తెలివితేటలే ప్రధానం అని తెలుసుకోడానికి ఎన్నైనా ఉదాహరణలు చెప్పుకోవచ్చు.పాండవులతో పోల్చుకుంటే, కౌరవుల వైపు యోధానుయోధులున్నారు. కానీ ఏం లాభం? సరైన వ్యూహాలు లేకపోవడం, గర్వంతో విరవీగే దుర్యోధనుడి చేష్టలతో చేజేతులా ఓటమిని, మృత్యువును కొని తెచ్చుకున్నారు. అంతిమంగా పాండవులే విజేతలు.కురుక్షేత్రం గురించి వైఎస్ జగన్ ఊరికే మాట్లాడ్డం కాదు. కురుక్షేత్రం నుంచి ఏం నేర్చుకోవాలో వైసీపీ నేతలు ఆలోచించుకోవాలి. ప్రస్తుతం వైసీపీలో జగన్ చుట్టూ ఎక్కువగా శకుని మామలున్నారు. జగన్‌కు వాళ్లే ఇప్పుడు ప్రధాన శత్రువులు. దురదృష్టవశాత్తు వాళ్లను గుర్తించే పరిస్థితి లేదు. సినిమాల్లో అయినా చివరికి విలన్లను గుర్తిస్తాం. కానీ వైసీపీ సినిమాలో అంత సీన్ లేదు.వైఎస్ జగన్‌కు జనం వెల్లువెత్తుతున్నారని ఊరికే సంబరపడిపోతే సరిపోదు. ఎన్నికల యుద్ధంలో గెలవడానికి, శ్రీకృష్ణుడిలా వ్యూహాలు రచించేవారు, సరైన మార్గంలో నడిపించే రథసారథి అవసరమని గుర్తించాలి. అందుకు తగ్గట్టు ఇప్పటి నుంచే తగిన వ్యూహాలు రచించుకుంటూ, ముందుకు సాగితేనే 2029లో విజయం అని వైఎస్ జగన్ సహా, ఆ పార్టీ నాయకులు గుర్తెరగాలి.

# చమురు సెగ.. రూపాయి విలవిల!

న్యూఢిల్లీ,దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే మూడు కీలక అంశాలు ఒకేసారి ప్రతికూల దిశలో కదులుతున్నప్పుడు ఆందోళన చెందడం సహజం. పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి, పసిడి ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత- ఈ మూడు పరిణామాలు ప్రస్తుతం సామాన్యుడి నుంచి వ్యాపార వర్గాల వరకు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నాయి. వీటికి తోడు అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు మార్కెట్‌లో అనిశ్చితి వంటి అంశాలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ప్రశ్న ఒక్కటే- పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు? చమురు ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారుల జేబుపై పడే భారం కాదు. అది ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగాన్నీ తాకే ప్రభావశీలమైన అంశం. భారతదేశం తన ఇంధన అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగినప్పుడు దిగుమతి బిల్లు పెరుగుతుంది. అదే సమయంలో దేశీయ కరెన్సీ బలహీనపడితే, విదేశీ మారకంలో చెల్లించాల్సిన మొత్తం మరింత భారమవుతుంది. అంటే చమురు ధర పెరగడం ఒక సమస్య అయితే, రూపాయి విలువ పడిపోవడం ఆ సమస్యను రెట్టింపు చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంతో మొదలై వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగం, సరఫరా వ్యవస్థ, రిటైల్ మార్కెట్ వరకు విస్తరిస్తుంది. లారీలు, బస్సులు, ట్యాక్సీలు, సరుకు రవాణా వాహనాల నిర్వహణ వ్యయం పెరిగితే దాని ప్రభావం చివరకు వస్తువుల ధరలపై పడుతుంది. రైతులకు డీజిల్ ధర పెరగడం అంటే సాగునీటి పంపులు, వ్యవసాయ యంత్రాలు, పంట రవాణా వంటి అనేక ఖర్చులు పెరగడమే. పరిశ్రమలకు ఇంధన వ్యయం పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది.ఉత్పత్తిదారుడు ఆ భారాన్ని పూర్తిగా భరించలేకపోతే వినియోగదారుడిపైనే కొంత భాగాన్ని మోపాల్సి వస్తుంది. ఇదే ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రధాన మార్గాల్లో ఒకటి. ఇంధన ధరలు పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ఆహారం నుంచి తయారీ వస్తువుల వరకు అనేక ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే చమురు ధరల కదలికను కేవలం పెట్రోల్ బంకుల వద్ద కనిపించే ధరలతో కొలవడం సరికాదు. దాని ప్రభావం కుటుంబ బడ్జెట్‌లోని అనేక అంశాలపై పరోక్షంగా కనిపిస్తుంది. ఇక రూపాయి విలువ విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే దిగుమతుల వ్యయం పెరుగుతుంది. చమురు మాత్రమే కాదు -ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాలు, కొన్ని పారిశ్రామిక ముడి పదార్థాలు, రసాయనాలు, ఇతర దిగుమతి ఆధారిత వస్తువుల ధరలపైనా ప్రభావం పడుతుంది.అయితే రూపాయి పతనానికి అంతా ప్రతికూలమే అని చెప్పలేం. ఎగుమతిదారులకు కొంత ప్రయోజనం లభించే అవకాశం ఉంటుంది. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో దిగుమతుల ప్రాధాన్యం అధికంగా ఉన్న పరిస్థితుల్లో కరెన్సీ బలహీనత ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే ప్రమాదం మాత్రం విస్మరించలేనిది. ఈ నేపథ్యంలో బంగారం మరో ప్రత్యేక కథ చెబుతోంది. సాధారణంగా అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్లలో అస్థిరత పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గుచూపుతారు. బంగారానికి అలాంటి సమయంలో డిమాండ్ పెరగవచ్చు. దేశీయంగా రూపాయి బలహీనపడటం కూడా రూపాయి లెక్కల్లో బంగారం ధర పెరగడానికి కారణమయ్యే అవకాశం ఉంది. అందుకే ఒకవైపు స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు




గురవుతుంటే మరోవైపు పసిడి ధరలు పైకి కదలడం కనిపిస్తుంది.అయితే బంగారం ధర ఎప్పుడూ ఒకే దిశలో పెరుగుతుందని భావించడం కూడా పొరపాటే. అంతర్జాతీయ వడ్డీ రేట్లు, అమెరికా డాలర్ బలం, కేంద్ర బ్యాంకుల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్, ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంచనాలు వంటి అనేక అంశాలు బంగారం ధరను ప్రభావితం చేస్తాయి. అందుకే రోజువారీ ధరల మార్పులను చూసి భయపడటం కన్నా, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. మరోవైపు స్టాక్ మార్కెట్లలో కనిపిస్తున్న ఒడిదుడుకులు కూడా ఈ సమీకరణంలో భాగమే. ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి ఆధారిత కంపెనీల ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి బలహీనపడితే విదేశీ మారకపు రుణాలు లేదా దిగుమతులపై ఆధారపడే సంస్థలపై ఒత్తిడి రావచ్చు. అదే సమయంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గిస్తే మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు.అయితే కొన్ని ఎగుమతి ఆధారిత రంగాలకు బలహీన రూపాయి అనుకూలంగా మారే అవకాశమూ ఉంది. కాబట్టి మార్కెట్‌లో ప్రతి రంగం ఒకే విధంగా ప్రభావితమవుతుందని భావించడం సరికాదు. అందువల్ల పెట్రో, పసిడి, రూపాయి అనే మూడు సూచికలను విడివిడిగా చూడటం కన్నా వాటి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చమురు ధరలు పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది; దిగుమతి బిల్లు పెరిగితే రూపాయిపై ఒత్తిడి రావచ్చు; రూపాయి బలహీనపడితే దిగుమతులు మరింత ఖరీదవుతాయి; అంతర్జాతీయ అనిశ్చితి పెరిగితే బంగారం వైపు పెట్టుబడులు మళ్లవచ్చు; మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింటే స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతాయి.ఈ పరిణామాలన్నీ చివరకు సామాన్యుడి జీవన వ్యయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి నేటి పరిస్థితి కేవలం ధరల పెరుగుదల కథ కాదు -ఆర్థిక స్థిరత్వానికి ఎదురవుతున్న పరీక్ష. తాత్కాలిక ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. పెట్రో మంటను తగ్గించాలి, రూపాయి విలువను నిలబెట్టే ఆర్థిక పునాదులను బలోపేతం చేయాలి, పసిడి ధరల ఊగిసలాట వెనుక ఉన్న అంతర్జాతీయ అనిశ్చితిని అర్థం చేసుకోవాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి సామాన్యుడికి ఉపశమనం లభిస్తుంది. ప్రపంచ పరిణామాలు మన తలుపు తట్టకముందే వాటి ప్రభావాన్ని అంచనా వేసి సిద్ధపడటమే సమర్థ ఆర్థిక పాలన. లేకపోతే పెట్రో మంట, పసిడి మెరుపు, రూపాయి పతనం- మూడూ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రశ్న దారెటు? అనేదే కాదు; సరైన దారిని ఇప్పుడే ఎంచుకోగలమా? అన్నదే అసలు ప్రశ్న.

# 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టాలని భావిస్తున్న ప్రతిష్టాత్మక 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. ఏపీ జలాలపై ఈ విమానాలను నడిపేందుకు ఆసక్తి చూపిస్తూ 'మే హెయిర్', 'స్కైహోప్' వంటి ప్రముఖ దేశీయ విమానయాన సంస్థలు సమర్పించిన నివేదికలకు కేంద్ర పౌరవిమానయాన శాఖ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. పర్యాటక ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, టూరిస్టులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.ఈ ప్రాజెక్టు సజావుగా సాగడానికి కీలకమైన 'వాటర్ డ్రోమ్' అంటే నీటిపై రన్‌వేలు, మౌలిక వసతుల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటి నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ పనుల కోసం త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది కీలక పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాలను గుర్తిస్తూ, సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో ఈ వాటర్ డ్రోమ్ నెట్‌వర్క్‌ను డెవలప్ చేయనున్నారు.కేంద్ర ప్రభుత్వ 'ఉడాన్' ఉద్దీపన పథకం మద్దతు కూడా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ చాలా త్వరగా కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా.. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ (పున్నమి ఘాట్), విశాఖ సాగరం, మరియు శ్రీశైలం కృష్ణా నది పరివాహక ప్రాంతాల మధ్య ఈ సీ ప్లేన్లు రాకపోకలు సాగించనున్నాయి. వీటితో పాటు కాకినాడ, సూర్యలంక బీచ్, గండికోట గిరి లోయలు, తిరుపతి రాయలచెరువు, అరకు సమీపంలోని జోలాపుట్ మరియు లంబసింగి తాజంగి జలాశయాలను కూడా ఈ రూట్ మ్యాప్‌లో చేర్చారు. ఈ వినూత్న సేవలు అందుబాటులోకి వస్తే.. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, విహారయాత్ర స్థలాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గడమే కాకుండా, ఏపీ టూరిజం గ్లోబల్ మ్యాప్‌లో మరింత ప్రత్యేకంగా నిలవనుంది

# స్లమ్స్ వారి కోసం భవనాలు

విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, మురికివాడల పునర్నిర్మాణ చరిత్రలో కూటమి ప్రభుత్వం మరో కీలక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టిన మురికివాడల పునర్నిర్మాణం ప్రోగ్రామ్‌కు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ విశాఖపట్నం వేలంపేటలో శంకుస్థాపన చేశారు. గత 50 ఏళ్లుగా సరైన నివాస వసతి లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్న 177 కుటుంబాల కలలను సాకారం చేస్తూ, వారి కోసం ఆధునిక అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులకు ఆయన అధికారికంగా భూమిపూజ నిర్వహించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది.ఈ ప్రాజెక్టు కింద మొత్తం 177 పేద కుటుంబాలకు ఉచితంగా అత్యాధునిక వసతులతో కూడిన ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నారు. 2,691 చదరపు అడుగుల స్థల విస్తీర్ణంలో, 45 మీటర్ల ఎత్తుతో మొత్తం 12 అంతస్తుల టవర్ నిర్మాణం జరగనుంది. మొత్తం 28.44 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఒక్కో ఫ్లాట్ విలువ సుమారు 16 లక్షలుగా ఉంటుంది. కాంక్రీట్ నిర్మాణాల్లో అత్యంత నాణ్యమైన, వేగవంతమైన షిర్ వాల్ సాంకేతికతను ఉపయోగిస్తూ, రాబోయే 9 నెలల్లోనే నిర్మాణాన్ని పూర్తి చేసి బాధితులకు ఇళ్లను అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.పట్టణాల్లోని పేదల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ధారావి మోడల్ లో ఈ అభివృద్ధి పనులు చేపడుతోంది. వేలంపేట స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ రాష్ట్రానికే ఒక రోల్ మోడల్ అని, మురికివాడల్లో నివసించే పేదలకు ఆ స్థలంలోనే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వడం ద్వారా వారికి ఆర్థిక, సామాజిక భద్రత చేకూరుతుందని నారాయణ చెబుతున్నారు. ఇదే నమూనాలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు పట్టణాలు, నగరాల్లోని మురికివాడలను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రచిస్తున్నామని వెల్లడించారు.దశాబ్దాలుగా మురికివాడల్లో అరకొర వసతులతో, అపరిశుభ్ర వాతావరణంలో బతికిన పేద కుటుంబాలకు విశాఖ నడిబొడ్డున 16 లక్షల విలువైన మోడల్ ఫ్లాట్ ఉచితంగా దక్కనుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విశాఖ నగరాన్ని మురికివాడలు లేని నగరంగా మార్చడానికి దోహదపడటమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రధాన నగరాల రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తుందని భావిస్తున్నారు.

# పాదయాత్రల సీజన్

విజయవాడ, ఏపీ, తెలంగాణలో వచ్చే ఏడాది పాదయాత్ర సీజన్ మొదలయ్యేలా కనిపిస్తోంది. ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను రాష్ట్రవ్యాప్తంగా 'పాదయాత్ర 2.0' చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని పార్టీ సెంట్రల్ ఆఫీసులో పర్చూరు నియోజకవర్గ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జగన్ పాల్గొన్నారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో తాను పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో వైసీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడమే పాదయాత్ర లక్ష్యంగా పేర్కొన్నారు. గతంలో వైఎస్ జగన్ చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' ఆయన రాజకీయ జీవితంలోనే కీలకంగా మారింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తూ అధికారం సొంతం చేసుకున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పేరుతో ఏపీ ప్రభుత్వం డ్రామాలు చేస్తుందని, ఇవన్నీ కోర్టులో చెల్లవని సీఎం చంద్రబాబుకు ముందే తెలుసునన్నారు. గావిఖీ ప్రక్రియతో రాష్ట్రంలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, చంద్రబాబు ఉండగా ఎన్నికలు సజావుగా సాగే అవకాశమే లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని, ఎలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతున్నాయో అర్థం చేసుకుని వైసీపీ నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గట్టిగా పోరాటం చేసి ఎన్నికల్లో విజయాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. 2017 నవంబర్ 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ స్మృతి వనం నుంచి ప్రారంభమైన ఆ యాత్ర సుమారు 341 రోజుల పాటు సాగింది. అప్పటి మొత్తం 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాలు, 2,516 గ్రామాల మీదుగా 3,648 కిలోమీటర్లు చేసిన ఈ పాదయాత్రలో కోట్ల మంది ప్రజలను నేరుగా కలుసుకున్నారు.ఆ రోజుల్లో ప్రతిపక్ష నేతగా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, అన్ని వర్గాల సమస్యలను తెలుసుకున్న జగన్ 'నవరత్నాలు' సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించారు. ఈ ప్రజా సంకల్ప యాత్ర అందించినప్రజాదరణతోనే 2019 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు 'పాదయాత్ర 2.0' చేస్తానని జగన్ నిర్ణయం తీసుకున్నారు

# రెబల్స్ డేంజర్ బెల్స్

తిరుపతి,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం.పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కడా పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది.మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది.అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# సర్కార్ వారి రైడింగ్ యాప్..

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమిషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమిషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలపై చర్చించారు. డ్రైవర్లతో పాటు ఇతర కార్మికుల భద్రత కోసం ఇన్స్యూరెన్స్ పాలసీని అమలు చేయడంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రభుత్వం తరపున ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అత్యంత తక్కువ ధరల్లో ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందిస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు కమిషన్ల భారం కూడా తగ్గి వారికి ప్రయోజనం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని, ప్రస్తుతం పెంచేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఆటో కార్మికుల సంఘాలు, రవాణశాఖ అధికారులతో ఛార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎంత పెంచాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పించనుందని, ఆ నివేదిక పరిశీలించాక ఎంత పెంచాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.

# చందిప్పలో అర్ధరాత్రి దారుణం

రంగారెడ్డి , శంకర్ పల్లి మండలం చందిప్ప గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఘోర కలకలం రేగింది.ఒంటరిగా ఉన్న ఓ 80 ఏళ్ల వృద్ధురాలిపై దుండగులు కత్తులతో దాడికి తెగబడ్డారు.చోరీ ప్రయత్నంలో భాగంగానే ఈ దాడి జరిగినట్లు స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.గ్రామస్తులు మరియు పోలీసుల కథనం ప్రకారం.. చందిప్ప గ్రామానికి చెందిన చాకలి రుక్కమ్మ (80) అనే వృద్ధురాలు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (సుమారు12:10గంటల ప్రాంతంలో) మూత్ర విసర్జన కోసం ఇంటి బయటకు వచ్చారు.ఆ సమయంలో ఇంటి పక్కన ఎవరో నక్కి ఉన్నట్లు గమనించిన ఆమె,అనుమానంతో గట్టిగా కేకలు వేశారు.దీంతో తీవ్ర ఆందోళనకు గురైన దుండగులు, తమ వెంట తెచ్చుకున్న కత్తులతో వృద్ధురాలిపై ఒక్కసారిగా దాడి చేసి అక్కడి నుంచి చీకట్లోకి పరారయ్యారు.ఆమె పెట్టిన ఆర్తనాదాలు విన్న చుట్టుపక్కల ప్రజలు వెంటనే సంఘటనా స్థలానికి పరుగులు తీశారు.రక్తపు మడుగులో ఉన్న వృద్ధురాలిని చూసి షాక్‌కు గురైన స్థానికులు,వెంటనే శంకర్ పల్లి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందిన వెంటనే శంకర్ పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.పరిస్థితిని సమీక్షించి, బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

# తయారీ ఎందుకు.. అక్రమ రవాణా సరిపోదా?..



న్యూఢిల్లీ,ఇండియా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సెమీకండక్టర్ తయారీ ప్రయత్నాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ప్రపంచ దేశాల నుంచి చిప్‌లను దేశీయంగా తయారు చేయడం కంటే, వాటిని సులభంగా అక్రమ రవాణా చేసుకోవచ్చని లేదా దిగుమతి చేసుకోవచ్చని ఆయన అభిప్రాయపడటం పట్ల ఆర్థిక, పారిశ్రామిక వర్గాల నుంచి భారీ స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.భారత్ తన సొంత గడ్డపై సెమీకండక్టర్ చిప్‌లను ఉత్పత్తి చేయడానికి వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించాల్సిన అవసరం ఏమిటని రఘురామ్ రాజన్ ప్రశ్నించారు. ఈ భూమిపై అత్యంత సులభంగా అక్రమ రవాణా చేయగలిగిన వస్తువు ఏదైనా ఉందంటే అది చిప్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ప్రపంచ దేశాలు ఏకమై భారత్‌ను కట్టడి చేయాలని చూసినా.. దేశానికి చెందిన కోట్లాది మంది ప్రవాస భారతీయులు వాటిని ఎలాగోలా కొనుగోలు చేసి దేశానికి తీసుకువస్తారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురయ్యాయి.పారిశ్రామిక విధానాలు, ప్రభుత్వ రాయితీలపై తనకున్న వ్యతిరేకతను వ్యక్తపరుస్తూ రాజన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో సెమీకండక్టర్ల కోసం భారీగా నిధులు కేటాయించే బదులు, ప్రాథమిక విద్య, నాణ్యమైన వైద్యం, మెరుగైన మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన దీర్ఘకాలంగా వాదిస్తున్నారు. అయితే ఆయన ఆర్థిక సిద్ధాంతాల్లోని సూక్ష్మ అంశాల కంటే, అక్రమ రవాణా చేయవచ్చనే వ్యాఖ్యే ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకుని పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.ఈ వ్యాఖ్యలపై పారిశ్రామిక దిగ్గజాలు, నిపుణుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తింది. జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ స్పందిస్తూ, రాజన్ ప్రతిపాదించే స్వేచ్ఛా మార్కెట్ విధానాలు భారతదేశాన్ని దక్షిణ కొరియా స్థాయికి కాకుండా, కేవలం మెక్సికో స్థాయికి మాత్రమే పరిమితం చేస్తాయని హెచ్చరించారు. కేవలం అసెంబ్లింగ్ పనులకే పరిమితం కాకుండా మేధో సంపత్తి, పరిశోధన, అభివృద్ధి రంగాలను దేశంలోనే అభివృద్ధి చేసుకోవడం ద్వారానే అత్యధిక విలువైన ఉద్యోగాలు, ఆర్థిక వృద్ధి సాధ్యమవుతాయనిఅన్నారు.చరిత్రను పరిశీలిస్తే, భారత్ గతంలో కూడా ఇలాంటి కీలకమైన పారిశ్రామిక అవకాశాలను కోల్పోయిన దాఖలాలున్నాయి. 1960ల ప్రారంభంలో సిలికాన్ విప్లవ వేళ ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్ సంస్థ భారతదేశంలో తన తొలి ఆసియా ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినప్పటికీ, నాటి సంక్లిష్టమైన నిబంధనలు, లైసెన్స్ పర్మిట్ రాజ్, అత్యధిక పన్నుల విధానాల కారణంగా ఆ సంస్థ మలేషియాకు తరలివెళ్లింది. ఆ తర్వాత కూడా పంజాబ్‌లోని ఎస్‌సీఎల్ సంస్థ ప్రమాదానికి గురికావడం వంటి పరిణామాలు భారత్‌ను వెనక్కి నెట్టాయి.ప్రస్తుత పరిస్థితుల్లో సెమీకండక్టర్ రంగంలో స్వయంసమృద్ధి సాధించడం కేవలం ఆర్థికపరమైన నిర్ణయం మాత్రమే కాకుండా, భౌగోళిక రాజకీయాల దృష్ట్యా వ్యూహాత్మక అవసరమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా విధిస్తున్న కఠినమైన సాంకేతిక నిబంధనలు, చైనా నుంచి అరుదైన భూమి అయస్కాంతాల సరఫరాలో ఏర్పడుతున్న ఆంక్షలు వంటి పరిణామాలు భారత్ సొంతంగా తయారీ రంగాన్ని కలిగి ఉండవలసిన ప్రాముఖ్యతను చాటుతున్నాయి. కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోతే భవిష్యత్తులో సరఫరా గొలుసులో తీవ్ర సంక్షోభాలు ఎదురయ్యే ప్రమాదముంది.ప్రభుత్వం ప్రస్తుతం సెమీకాన్ ఇండియా కార్యక్రమం కింద కోట్లాది రూపాయల పెట్టుబడులతో అనేక ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేస్తోంది. గుజరాత్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే కొన్ని ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభించగా, మరికొన్ని అత్యాధునిక ఫ్యాబ్రికేషన్ యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కేవలం విదేశాలపై ఆధారపడకుండా చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ముడిసరుకుల ఉత్పత్తిలో దేశాన్ని నిలబెట్టేందుకు ఈ ప్రణాళికలు పునాది వేస్తున్నాయి.ఈ మొత్తం పరిణామాలు ఇండియా భవిష్యత్ పారిశ్రామిక దిశపై ఒక దిశా నిర్దేశం చేస్తున్నాయి. కేవలం సేవారంగంపైనే కాకుండా, తయారీ రంగంలోనూ అగ్రగామిగా నిలవాలని భావిస్తున్న భారత్‌కు ఈ చర్చ సరికొత్త ఆలోచనలను రేకెత్తిస్తోంది. రాబోయే రోజుల్లో సాంకేతిక రంగంలో పూర్తి ఆధిపత్యం సాధించాలంటే కేవలం దిగుమతులపై ఆధారపడటం సరిపోదని, స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే ఏకైక మార్గమని స్పష్టమవుతోంది.

# ‘జిడిపి వృద్ధి’ అందరికీ అందుతుందా?

న్యూఢిల్లీ,దేశంలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 7.8 శాతంగా నమోదు కావడం హర్షదాయకం. ఈ ఆర్థిక విస్తరణ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం వృద్ధి రేటును, అలాగే చాలా మంది విశ్లేషకుల అంచనాలను మించిపోయింది. భౌగోళిక, రాజకీయ, ఉద్రిక్తతలు, ఇంధన ధరల్లో హెచ్చుతగ్గులు, ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ ఈ వృద్ధిని సాధించడం చెప్పుకోవలసిన పరిణామం. అయితే ఈ జిడిపి వృద్ధిపై కొందరు సందేహాలు వ్యక్తం చేస్తుండగా, మరి కొందరు ఏ విధంగా అభివృద్ధి సాధించామో ప్రభుత్వం పారదర్శకంగా వివరాలు తెలియజేయడం లేదని వాదిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధి కేవలం 2.6 శాతం మాత్రమే అని మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ చేసిన వ్యాఖ్య ప్రస్తుతం పెద్ద చర్చకు దారితీసింది.ఆయన వాదనను ప్రభుత్వం తిప్పిగొట్టి జిడిపి 7.8% సాధించగలిగామని స్పష్టం చేస్తోంది. ఈ రెండు వాదనల మధ్య వ్యత్యాసం ఎక్కువగా కనిపిస్తోంది. ఒక వృద్ధి రేటు మరొక దానికంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉంది. ఈ చర్చ గణాంకాలపై జరిగే వాదోపవాదంగా ఉండకూడదు. ఈ వృద్ధి ప్రజల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపుతోందనే విశ్లేషణపై చర్చ ముందుకు సాగడం అవసరం. జిడిపి అనేది ఒక దేశంలో ఉత్పత్తి అయిన వస్తువులు, సేవల మొత్తం విలువను గణిస్తుంది తప్ప ఆ ఆదాయం ప్రజల మధ్య ఎలా పంపిణీ అయ్యిందీ, సాధారణ ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగిందీ అన్న వివరాలను జిడిపి తెలియజేయదు. గణాంకాలు బికినీ వంటివని, అవి బయటపెట్టేవి ఎలా ఉన్నా, దాచిపెట్టినవి ఏమిటో తెలుసుకోవడం అత్యంత ముఖ్యం అని అమెరికన్ విద్యావేత్త లారెన్స్ జె. పీటర్ చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా అన్వయించుకోవడం అవసరం.2019లో అప్పటి మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ తన పరిశోధన పత్రంలో భారత అభివృద్ధి రేటుపై తన అధ్యయనం వెల్లడించారు. 2011 తరువాత భారత దేశ ఆర్థిక వృద్ధి రేటును ప్రతి సంవత్సరం సుమారు 2.5 శాతం పాయింట్లు ఎక్కువగా చూపించారని వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం 2011 నుంచి 2016 మధ్య భారత దేశ సగటు జిడిపి వృద్ధి రేట్లు 6.9 శాతంగా ఉంది. కానీ వాస్తవ వృద్ధి రేటు 3.5 శాతం నుంచి 5.3 శాతం మధ్య మాత్రమే ఉండి ఉండవచ్చని అరవింద్ సుబ్రహ్మణియన్ వెల్లడించారు. దీన్ని బట్టి ప్రభుత్వం ప్రకటించిన జిడిపి కంటే దేశం నిజమైన జిడిపి తక్కువగా ఉండిఉండవచ్చని, ఐదు సంవత్సరాలను కలిపి చూసినప్పుడు జిడిపి స్థాయిని సుమారు 9% నుంచి 21 శాతం వరకు ఎక్కువగా అంచనా వేసి ఉండవచ్చని ఆయన చెప్పారు.ఈ పరిశోధన పత్రాన్ని హార్వర్డ్ యూనివర్శిటీ లోని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ప్రచురించింది. 20112016 మధ్య భారతదేశ ఆర్థిక వృద్ధిని అధికారిక గణాంకాలు వాస్తవం కంటే ఎక్కువగా చూపించాయని అరవింద్ వెల్లడించారు. ఈ వాదనలను ప్రభుత్వం కొట్టిపారేసింది. ప్రభుత్వం నియమించిన ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా ‘ఇవన్నీ తప్పుడు వాదనలని, సరిగ్గా చదువుకోకుండా చేసినవి’ అని ఖండించారు. ప్రధాన మంత్రి ఆర్థిక




సలహా మండలి సభ్యుడు గౌరవ్ వల్లభ్ జిడిపి వృద్ధి రేటుపై తన అభ్యంతరాన్ని సంయమనంతో వ్యక్తం చేసినప్పటికీ, ప్రభుత్వ వైఖరినే గట్టిగా సమర్థించారు. ‘జిడిపి లెక్కలు వేసినప్పుడు ఒక ఆధార సంవత్సరాన్ని (బేసిక్ ఇయర్) తీసుకుంటారు.ఆ ఆధార సంవత్సరాన్ని మార్చినప్పుడు జిడిపి అంచనాలు కూడా మారవచ్చు. ఆ మార్పు ధరలు పెరగడం, లేదా తగ్గడం వల్ల మాత్రమే కాదు. ఆర్థిక వ్యవస్థను కొలిచే విధానం, ఉత్పత్తి, ఇతర గణాంకాల్లో మార్పుల వల్ల కూడా జిడిపి అంచనాలు మారవచ్చు’ అని గౌరవ్ వల్లభ్ చెబుతున్నారు. జిడిపి వృద్ధి రేటు వివరాల విషయంలో పారదర్శకత, విశ్వసనీయతకు సంబంధించిన పెద్ద లోపాలు ఉన్నాయి. అంతేకాకుండా ఉద్యోగాలు లేకుండా ఆర్థిక వృద్ధి జరుగుతున్న సమస్య కూడా కనిపిస్తోంది. అంటే అసలు ఉద్యోగాల సృష్టి జరగలేదని కాదు, కానీ సృష్టించబడుతున్న ఉద్యోగాల పరిమాణం, నాణ్యత ఆందోళనకరంగా ఉన్నాయి. పెద్ద జిడిపి సంఖ్య ఆర్థిక వేత్తలను ఆకట్టుకోవచ్చు. కానీ పనిచేయగల వయస్సున్న యువత జనాభా పెరుగుతోంది వీరికి తగినంత, ఉత్పాదకమైన, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జిడిపి వృద్ధి రేటు మారకపోతే సాధారణ ప్రజలకు ఆ జిడిపి వృద్ధి పెద్దగా ఉపయోగపడదు.జిడిపి వృద్ధి రేటు పెరుగుతోందని గొప్పగా చెప్పుకుంటే సరిపోదు. ఆర్థిక వ్యవస్థ ఎంత పెరిగినా ప్రజలకు మంచి ఉద్యోగాలు, స్థిరమైన ఉపాధి అవకాశాలు, తగిన ఆదాయం కల్పించే మార్గాలు లభించకపోతే ఆ జిడిపి వృద్ధి సాధారణ ప్రజల్లో పెద్దగా మార్పు తీసుకురాదు. దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత ఉద్యోగాల్లో ప్రవేశించడానికి సిద్ధమవుతున్నారు. వారిలో చాలా మందికి స్థిరమైన, తగినంత వేతనం లభించే ఉద్యోగాలు దొరకడం లేదు. అందువల్ల 7.8 శాతం జిడిపి వృద్ధిపై జరుగుతున్న చర్చ గణాంకపరమైన వివాదంగా కాకుండా ఈ వృద్ధి అన్ని రంగాలకు విస్తరించిందా? ప్రజలకు ఉత్పాదకమైన, స్థిరమైన జీవనోపాధిని కల్పించగల సామర్థం ఈ జిడిపి వృద్ధికి ఉందా? అన్న అంశాలపైనే విస్తృతంగా చర్చ జరగాలి. అప్పుడు జిడిపి వృద్ధి రేటు ఫలితాలు ప్రజలకు తెలిసే అవకాశం కలుగుతుంది.ఈ మేరకు గణాంకాలను పారదర్శకంగా అందించడంలోనే కాకుండా, వీటిని ఎలా లెక్కిస్తున్నారో స్పష్టంగా ప్రభుత్వం వివరించగలిగితే ప్రభుత్వ జిడిపి గణాంకాలపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడుతుంది.

# ఏపీ వ్యాప్తంగా సర్కారీ మీ మార్ట్ ...

విజయవాడ, టైర్ వన్, టైర్ టు, టైర్ త్రీ.. ఇలా మూడంచల విధానంలో వ్యాపారం చేస్తోంది డి మార్ట్. పప్పుల నుంచి ఉప్పుల దాకా.. బట్టల నుంచి నెత్తికి రాసుకునే నూనె దాకా ఇలా ప్రతి వస్తువును వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చి.. తక్కువ ధరలో అమ్ముతూ తిరుగులేని మార్కెట్ ను డి మార్ట్ సొంతం చేసుకుందిగతంలో ఫ్యూచర్ గ్రూప్ ఆధ్వర్యంలో బిగ్ బజార్ ఉండేది. ఆ తర్వాత రిటైల్ విభాగంలోకి అనేక పెద్ద పెద్ద సంస్థలు వచ్చాయి. కాకపోతే అవేవీ కూడా మార్కెట్ పరిస్థితులను అంచనా వేయలేక.. సరైన వాటాను సొంతం చేసుకోలేకపోయాయి. రిలయన్స్.. ఆదిత్య బిర్లా.. ఇంకా అనేక పేరు మోసిన సంస్థలు ఉన్నప్పటికీ రిటైల్ విభాగంలో ఆశించిన మార్కెట్ వాటాను అందుకు లేకపోయాయి. కాకపోతే డిమార్ట్ డిఫరెంట్ ప్లాన్ తో రంగంలోకి వచ్చింది. తిరుగులేని మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. దీనిపై అనేక రకాలుగా ఆరోపణలు ఉన్నప్పటికీ డీమార్ట్ దూకుడు జోరుగాని సాగుతోంది.డి మార్ట్ దూకుడుకు కళ్లెం వేయడంలో పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలే తట్టుకోలేకపోయాయి. కానీ ఇప్పుడు ఆ బాధ్యతను ఏపీ ప్రభుత్వం భుజాలకు ఎత్తుకుంది. వాస్తవానికి ఒక కార్పొరేట్ సామ్రాజ్యాన్ని ఢీకొట్టడం.. అది కూడా ఒక ప్రభుత్వం చేయడం అనేది దేశ చరిత్రలో ఇదే తొలిసారి. వాస్తవానికి డీమార్ట్ చాప కింద నీరు లాగా విస్తరిస్తున్న నేపథ్యంలో.. ప్రజలకు మరింత తక్కువ ధరలో సరుకులు అందించడానికి.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో డీమార్ట్ కు పోటీగా అదే స్థాయిలో మీ మార్ట్ ఏర్పాటు చేస్తోంది. తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులను అందించడానికి నేషనల్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ సహకారం తీసుకోబోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1000 మీ మార్ట్ లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.ఇప్పటివరకు ఏకంగా 870 షాపులను ప్రభుత్వం సిద్ధం చేసింది. మరో 130 షాపులను వేగంగా పూర్తి చేయడానికి అడుగులు వేస్తోంది. అక్టోబర్ 1 న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మీ మార్ట్ లను ఒకేసారి ప్రారంభించబోతున్నారు. డి మార్ట్ తో పోటీపడేందుకు.. సేమ్ అదే కాన్సెప్ట్ తో మీ మార్ట్ లను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. తక్కువ ధరకే సరుకులు అందించేలా వీటిని రూపొందిస్తుంది.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు

విజయవాడ,మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది.ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది.మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్–టు–కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది.భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా

డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది.ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది.మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

ముంబై, రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు

# ఉద్యమాల గడ్డ నుంచే తొలి పోరు....



వరంగల్,తెలంగాణ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయానికి తెరలేపిన కల్వకుంట్ల కవిత, తన కొత్త రాజకీయ వేదిక తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తొలి సమరానికి చారిత్రక నగరం వరంగల్‌ను ఎంచుకున్నారు. ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఓరుగల్లు గడ్డ నుంచే తన పార్టీ ఎన్నికల ప్రస్థానం మొదలుకానుందని హనుమకొండ వేదికగా కవిత ప్రకటించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని వెల్లడించారు. సరికొత్త పేరు, పాత సెంటిమెంట్‌ల కలబోతతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ మనుగడను, భవిష్యత్ రాజకీయ బలాన్ని నిర్ణయించే కీలక అగ్నిపరీక్షగా మారనున్నాయి.కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని అస్త్రంగా చేసుకుని కవిత రంగంలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ. 13వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆమె నిరసన బాట పట్టారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన కవిత, అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.రాజకీయాల్లో కొత్తగా ఆవిర్భవించిన ఏ పార్టీకైనా క్షేత్రస్థాయి క్యాడర్ బలం, ఓటు బ్యాంక్ నిర్మాణమే అతిపెద్ద సవాలు. కవిత తెలంగాణ రక్షణ సేనను ప్రకటించిన నాటినుంచీ ఆమె రాజకీయ ప్రభావం ఎంతవరకు ఉంటుందనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా ఈ తరుణంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో పోటీ చేయాలనే నిర్ణయం ఆ పార్టీకి ఒక కత్తిమీద సాము వంటిది.వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే పటిష్టమైన క్యాడర్‌తో ఉన్నాయి. అలాంటి త్రిముఖ పోటీ వాతావరణంలో టీఆర్ఎస్ తనకంటూ సొంత ఓటు శాతాన్ని రాబట్టుకోగలదా లేదా అన్నది ఈ ఎన్నికల్లోనే తేలిపోనుంది. అన్ని డివిజన్లలో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నిర్మించుకోవడమే కవిత వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, బలమైన అసంతృప్త నేతలను తమ వైపు తిప్పుకోవడంలో పార్టీ ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది కీలకం. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించి, ప్రజా సమస్యల ద్వారా పాలకులపై పోరాడటం ద్వారా తృతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కవిత ఆశిస్తున్నారు.రాష్ట్ర రాజకీయాల్లో తాము నామమాత్రపు పాత్రధారులం కాదని, ప్రత్యర్థులకు గట్టి సవాలు విసరగల పూర్తిస్థాయి ప్రత్యామ్నాయ శక్తినని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కవితపై ఉంది. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కవిత కొత్త ప్రస్థానానికి నైతిక స్థైర్యాన్ని ఇస్తాయా, లేక ఎదురీతను తప్పించవా అనేది త్వరలోనే తేలనుంది. ఈ ఎన్నికల వేదికపై తెలంగాణ రక్షణ సేన ప్రదర్శించే ప్రభావమే ఆ పార్టీ భవిష్యత్ రాజకీయ మనుగడను దిశానిర్దేశం చేయనుంది.

# 60 రోజుల గడువుకు చెల్లు! ఉద్యోగం కోల్పోతే దేశం వీడాల్సిందే




వాషింగ్టన్, విదేశీ ఉద్యోగులపై ట్రంప్ సర్కార్ మరో పిడుగు వేసింది. ఉపాధి ముగిసిన తర్వాత హెచ్1బీ, ఎల్1 వీసాదారులు వంటి నిర్దిష్ట వలసేతర ఉద్యోగులకు(నాన్ ఇమిగ్రెంట్) ప్రస్తుతం లభిస్తున్న 60 రోజులు అదనపు గడువును రద్దు చేసేందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనను అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) గురువారం విడుదల చేసింది. అంటే ఇకపై ఉద్యోగం కోల్పోతే దేశం వీడాల్సిందే.ఈ ప్రతిపాదన ఉపాధి ఆధారిత నాన్-ఇమిగ్రెంట్ వీసా విభాగాలకు సంబంధించిన అనేక అంశాలను స్పృశిస్తున్నప్పటికీ భారతీయ ప్రవాస సమాజం దృష్ట్యా చూస్తే దీని ప్రభావం ప్రధానంగా హెచ్1బీ, ఎల్1, ఓ1 వీసాదారులపై (అసాధారణ ప్రతిభకు గుర్తింపు పొందిన వారు) ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగం కోల్పోయిన అర్హత గల హెచ్1బీ ఉద్యోగులు వరుసగా 60 రోజుల వరకు లేదా వారి అధీకృత నివాసం ముగిసే వరకు, ఏది ముందుగా వస్తే దాని వరకు విచక్షణాపరమైన గడువును పొందవచ్చు. ఈ కాలంలో వారు మరొక స్పాన్సరింగ్ యజమాని కోసం వెతుకవచ్చు. హోదా మార్పు కోరవచ్చు. లేదా అమెరికాను విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. అయితే హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ 60 రోజుల గడువును తొలగించాలని తాజాగా ప్రతిపాదిస్తున్నది. ఇది భారత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనున్నది.

### సర్వం వదులుకొని స్వదేశానికి పయనం!

వలసలపై ట్రంప్ యంత్రాంగం చేపట్టిన కఠిన చర్యలు, హెచ్-1బీ వీసాలకు సంబంధించి నెలకొన్న అనిశ్చితి అమెరికాలోని కొందరు భారతీయ సాంకేతిక నిపుణులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. టెక్సాస్‌లోని సెలీనా మెలిస్సా, డాలస్ సమీప శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పదికి పైగా హెచ్1బీ వీసా కలిగిన కుటుంబాలు తమ ఉద్యోగాలను కోల్పోయి, ఇండ్లు, కార్లు, ఇతర సామగ్రిని అక్కడే వదిలేసి భారత్‌కు తిరిగి వెళ్లిపోయాయని సోషల్ మీడియాలో ఒక పోస్టు వైరల్ అవుతున్నది. ఉద్యోగాలు కోల్పోయిన తర్వాత కొన్ని భారతీయ కుటుంబాలు గృహ రుణ వాయిదాలను, ఆస్తి పన్నులను చెల్లించలేకపోయాయి. ఆస్తి విలువలు పడిపోవడంతో మరి కొందరు తమ ఇండ్లను అమ్మడానికి ఇబ్బందులు పడ్డారని సమాచారం. భారత్ తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకునే ముందు అందులో కొన్ని కుటుంబాలు చాలా ఏండ్లపాటు అమెరికాలో నివసించాయని ఆ పోస్టు పేర్కొంది.

### మా దేశాన్ని వదిలిపోండి

భారత సంతతికి చెందిన ట్రక్‌డ్రైవర్లపై ట్రంప్ యంత్రాంగం మరోసారి విషం కక్కింది. జాతివివక్షను ప్రేరేపించేలా భారత సంతతి వారిని కించపరుస్తూ అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ విడుదల చేసిన ఒక ఏఐ పోస్టర్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత సంతతికి చెందిన ట్రక్ డ్రైవర్‌ను లక్ష్యంగా చేసుకుని ఏఐ ఆధారితంగా రూపొందించిన 'ట్రాన్స్‌ఫ్రార్మర్ సినిమా' తరహా పోస్టర్ తీవ్ర వ్యతిరేతను ఎదుర్కొంటున్నది. బుధవారం డీహెచ్ఎస్ ఎక్స్ ఖాతాలో ఉంచిన ఈ పోస్టర్‌కు 'ట్రాన్స్‌ఫార్మర్స్: బహిష్కరణల యుగం' అని టైటిల్ పెట్టింది. అందులో డీహెచ్ఎస్ చిహ్నం ధరించి ఉన్న ఒక పెద్ద ట్రాన్స్‌ఫార్మర్, తలపాగా ధరించిన ఒక సిక్కు వ్యక్తివైపు చూస్తున్నాడు. 'మిస్టర్ సింగ్.. అమెరికా దేశం అమెరికన్లకే.. మీకు ఎలా డ్రైవ్ చేయాలో తెలియదు. మా రోడ్లు వదిలిపోండి' అని పేర్కొనడమే కాక, ప్రజలు స్వచ్ఛందంగా తమ దేశాన్ని వదిలిపోవాలని స్పష్టం చేసింది.

# రాయదుర్గం భూముల వేలం వివరాలివ్వండి



హైదరాబాద్, రాయదుర్గం సర్వే నెం. 83/1లోని ఐదు ఎకరాల్లో రెండు ప్లాట్లను విభజించి లేఅవుట్ సవరించి ఈ- వేలం నిర్వహించడంపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేఅవుట్ ప్లాన్, ప్లాట్ నంబర్ల మార్పులకు సంబంధించిన వివరాలను కౌంటర్‌లో వెల్లడించాలని పేర్కొంటూ.. తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. వేలాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఈ ప్రాంతాన్ని గతంలో చారిత్రక, శిలా రక్షణ ప్రాంతంగా గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి నిబంధనల ప్రకారమే వేలం నిర్వహించామని

# స్థానిక ఎన్నికల్లో పోటీ.... జగన్ వ్యూహం ఇదే !



అమరావతి,స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ వైసీపీ ఎందుకు చేస్తుంది అంటే రాజకీయ పార్టీ కాబట్టి అని జవాబు రావచ్చు. అయితే వైసీపీ రెండేళ్ళ క్రితం దారుణంగా ఓటమి పాలు అయింది కదా, పైగా కూటమి అధికారంలో ఉంది కదా ఇంతలో మార్పు ఏమి వస్తుంది. కూటమి ఐక్యంగా ఉంది. మూడు పార్టీలు కలసి పోటీ పడుతున్న వేళ స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ఏమి ప్రయోజనం చేకూరుతుంది అన్న చర్చ ఉంది. అంతే కాదు ప్రజలు కూడా మరో మూడేళ్ళ పాటు అధికారం కూటమికే ఎటూ ఉంటుంది కాబట్టి కచ్చితంగా కూటమి అభ్యర్థులకే జై కొడతారు అన్నది కూడా వాస్తవం. మరిన్ని విషయాలు తెలిసి వైసీపీ పోటీ పడడం ఎందుకు అంటే అక్కడే జగన్ మార్క్ వ్యూహం ఉంది అని అంటున్నారు.

### కసి పెరగాలి అంటూ :

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగవని జగన్ పార్టీ నేతల సమావేశంలో చెప్పుకొచ్చారు. అంతమాత్రాన వైసీపీ ఎన్నికలను వదిలేసి దూరంగా వెళ్ళిపోదని అన్నారు. వైసీపీని నమ్ముకుని ప్రజలు ఉన్నారని వారి కోసం వారికి తోడుగా నిలబడేందుకు పోటీ చేయాల్సిందే అని జగన్ సూచిస్తున్నారు. అంతే కాదు పంచాయతీ వార్డు మెంబర్ విషయంలో కూడా కూటమి అసలు వదలదని పోలీసులను పెట్టి అధికార దుర్వినియోగం చేసి అయినా గెలిచేందుకు చూస్తుందని అన్నారు. అపుడు కచ్చితంగా ఆ వార్డు మెంబర్ గా పోటీకి దిగిన వైసీపీ కార్యకర్తకు కసి వస్తుందని అన్నారు, ఆ కసితోనే 2029 ఎన్నికల్లో కూటమిని ఓడించేందుకు పోరాటం చేసే స్ఫూర్తి వస్తుందని జగన్ విశ్లేషించారు. అందుకే పోటీ చేయమని తాను కోరుతున్నాను అని ఆయన చెప్పారు.

### గెలుపు కంటే పోరాటం :

స్థానిక ఎన్నికల్లో అంతా సజావుగా సాఫీగా సాగితే వైసీపీ విజయం ఖాయమని జగన్ స్పష్టం చేశారు. అయితే అలా జరపనీయరని ఆయనే విమర్శించారు. అయితే ఎన్నికల్లో పోటీ చేయడం ఒక పోరాటం అని ఆయన అభివర్ణిస్తున్నారు. అలా పోరటం చేసిన వారే 2029 ఎన్నికల నాటికి వైసీపీ తరఫున నిలిచే గట్టి క్యాడర్ గా మారుతారు అని ఆయన చెప్పారు. ఇంతకు ఇంత కూటమి మీద కసి తీర్చుకోవడానికి ఎదురుచూసే ప్రతీ వైసీపీ కార్యకర్త ఒక శ్రీ క్రిష్ణుడు అవుతాడు అని జగన్ చెప్పారు. అందువల్ల 2029 ఎన్నికల్లో జరగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో వీరే కూటమిని ఓడించి వైసీపీకి విజయం సాధించి పెడతారు అని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### స్తబ్ధుగా క్యాడర్ :

నిజానికి చూస్తే వైసీపీ క్యాడర్ అంతా స్తబ్దుగా ఉంది అని అంటున్నారు. ఎక్కడికక్కడ నాయకులు కానీ క్యాడర్ కానీ కో ఆర్డినేషన్ లేకుండా ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నారు. స్థానిక ఎన్నికలను కనుక వైసీపీ సీరియస్ గా తీసుకోకపోతే ఆ పార్టీకి ఓటేసే అభిమానులు కానీ 40 శాతం ఓటు షేర్ ని కాపాడుకోవడానికే రంగంలోకి దిగుతోంది అని అంటున్నారు. మరి వైసీపీకి 2024లో వచ్చిన 40 శాతం ఓటు షేర్ అలాగే కొనసాగుతుందా లేక పెరుగుతుందా లేక తగ్గుతుందా అన్నది కూడా ఈ లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు తెలియచేస్తాయి అని అంటున్నారు. చూడాలి మరి జగన్ చెప్పినట్లుగా క్యాడర్ లో కసి ఏ విధంగా ఉంటుందో.

## మీ మైండ్ ను శుద్ధి చేసుకోండి

హైదరాబాద్:కేసీఆర్ దగ్గర మార్కుల కోసం, కేటీఆర్, హరీష్ రావు పోటీ పడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరీ వెంకట్ ఆరోపించారు. అయన మీడియాతో మాట్లాడారు. హరీశ్ రావు, కేటీఆర్ దగ్గర మార్కుల కోసం, వాళ్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోటీ పడి, పోలీసులపై దాడి చేశారు. స్పీకర్ పై కూడా దూషణలకు దిగారు. కేసీఆర్ డైరెక్షన్లో ఇదీ ఃఖీా నేతల వ్యవహారం నడుస్తోంది. తప్పులు చేయడం, తప్పించుకునే ప్రయత్నం చేయడం. మళ్ళీ అవన్నీ ఏఐ కంటెంట్ బి అంటూ చెప్పుకోవడానికైనా సిగ్గు ఉండాలని అన్నారు.

# కేసీఆర్ ఏమయ్యారు?! ఇంత గొడవ జరుగుతున్నా ఉలకరెందుకు సారూ!



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనం తీవ్ర చర్చకు దారితీస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా రాజకీయంగా అధికార, విపక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పటికీ కేసీఆర్ జోక్యం చేసుకోకపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రభుత్వంపై రోజువారి పోరాటాల బాధ్యతను పార్టీ నేతలు కేటీఆర్, హరీష్ రావుకు అప్పగించినప్పటికీ శాసనసభ సమావేశాలతోపాటు రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పుడు కేసీఆర్ బయటకు వచ్చి మాట్లాడితే బాగుంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయంగా వాడివేడి వాతావరణం ఉన్నప్పుడు కూడా కేసీఆర్ వ్యూహాత్మక మౌనం పాటించడం వల్ల పార్టీపరంగా నష్టం జరగదా? అని ప్రశ్నిస్తున్నారు.తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజే రణరంగంగా మారిన విషయం తెలిసిందే. ఆ తర్వాత స్పీకర్ ను అవమానించారని ఆరోపిస్తూ అధికార కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం ఉంటున్న ఎర్రవెల్లి ఫాం హౌసు ఎదుట భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఏకంగా వేలాది డప్పులతో దండోరా వేయడంతో ఈ విషయం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకోడానికి బీఆర్ఎస్ నేతలు కూడా ఫాం హౌసుకు చేరుకోవడంతో రాజకీయ వాతావరణం వేడెక్కిపోయింది. ఒక విధంగా ఈ విషయంలో పైచేయి సాధించేందుకు రెండు పార్టీలు పోటాపోటీగా ఎత్తులుపై ఎత్తులు వేశాయని చెబుతున్నారు.అయితే మాజీ సీఎం కేసీఆర్ సభకు రాకపోవడంతోపాటు అసెంబ్లీ ఎదుట చోటుచేసుకున్న పరిణామాలకు ఆయన బాధ్యత వహించాలని, ఎర్రవెల్లి ఫాం హౌసులోనే కుట్ర జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నారు. అయినప్పటికీ కేసీఆర్ స్పందించకపోవడమే అంతుచిక్కడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో రేవంత్ రెడ్డి వరుసగా మాటల దాడి చేస్తున్నా, మాజీ సీఎం కేసీఆర్ అసలు ఏమీ పట్టించుకోకుండా ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదని అంటున్నారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలను పట్టించుకోవడం లేదని కేసీఆర్ సంకేతాలు ఇవ్వాలని అనుకుంటున్నారా? లేక ఆ విమర్శలకు కేటీఆర్, హరీశ్ రావుతో జవాబు చెబితే చాలు అన్న భావనలో ఉన్నారా? అనేది తెలియడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.నిజానికి రాజకీయాల్లో ప్రముఖ నేతలు ఇలా మౌనంగా ఉంటే, ప్రత్యర్థులు పైచేయి సాధించే అవకాశాలు ఉంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. తమ ఆరోపణలు నిజం కాబట్టే అవతలి వారు మాట్లాడటం లేదని ప్రచారం చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు అవుతుందని అంటున్నారు. కానీ, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఏదో బలమైన కారణంతోనే ప్రత్యర్థులను పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. తాను మాట్లాడితే పార్టీని నడుపుతున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు వాదనలకు ప్రాధాన్యం తగ్గిపోతుందని అనుకుంటున్నారా? లేక ఉద్యమ నాయకుడిగా తెలంగాణ సాధకుడిగా కీర్తి గడించిన వ్యక్తిని అనవసరంగా నిందిస్తున్నారని తన మౌనం ద్వారా ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టే వ్యూహాన్ని సైలెంటుగా అమలు చేస్తున్నారా? అన్నది చూడాల్సివుందని అంటున్నారు.

# తమిళ సంచలనం : చేతులు కలపనున్న స్టాలిన్ పళనిస్వామి ?



చెన్నై:తమిళనాడులో రెండు సంప్రదాయ ద్రవిడ పార్టీలను ఓడించి కొత్త పార్టీగా టీవీకేను అధికారంలోకి తెచ్చిన ఘనత దళపతి విజయ్ దే. గత ఆరు దశాబ్దాలుగా చేతులు మారుతూ వస్తున్న అధికారాన్ని అవకాశాన్ని డీఎంకే అన్నా డీఎంకేలకు దక్కనీయకుండా విజయ్ చేశారు. ప్రజలకు సరికొత్త ఆల్టర్నేషన్ గా తన పార్టీని చూపించారు. ఇక విజయ్ పార్టీకి సీట్లు కొన్ని తగ్గినా కాంగ్రెస్ ఇతర మిత్రులతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఇపుడు కొత్త కూటమిగా పేరు కూడా పెట్టారు, దీంతో దీర్ఘకాలంలో ఈ కూటమి ద్వారా తమిళనాడులో బలమైన రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని అధికారాన్ని పటిష్టం చేసుకోవాలని ముఖ్యమంత్రి విజయ్ చూస్తున్నారు. విజయ్ ఈ విధంగా రాజకీయ ఎత్తుగడలకు దిగడంతో సంప్రదాయ రాజకీయ శక్తులు ఇప్పటిదాకా ప్రత్యర్థులుగా ఉన్న డీఎంకే అన్నా డీఎంకేకి పెను సవాల్ గా మారుతోంది.

### త్రిముఖ పోరులో హిట్ :

ఇక తమిళనాడు రాజకీయ ముఖ చిత్రం 2026 మే నెలలో జరిగిన ఎన్నికల తర్వాత పూర్తిగా మారిపోయింది. మూడు పార్టీల వ్యవస్థగా అది పరిణమించింది. అంటే ఇక మీదట జరిగే ఏ ఎన్నిక అయినా త్రిముఖ పోరు అన్న మాట. త్రిముఖ పోరు అంటే అధికారంలో ఉన్న పార్టీలకు గెలుపు అవకాశాలు రెట్టింపు అవుతాయి. అదే విపక్షంలో ఉన్న పార్టీలకు ఓట్లు చీలి పీఠానికి ఎప్పటికీ దూరంగానే ఉండిపోతాయి. రాజకీయంగా ఢక్కామెక్కీలు తిన్న డీఎంకే అధినేత స్టాలిన్ అలాగే అన్నా డీఎంకేకి చెందిన అధినాయకుడు పళని స్వామికి తెలియనిది కాదు, దాంతో చిరకాల ప్రత్యర్థులు ఇద్దరూ ఇపుడు దీర్ఘ కాల వ్యూహాలకు పదును పెడుతున్నారు. దాంతో గత విభేదాలను మరచి ఒక వేదిక మీదకు వచ్చే అవకాశాలను కూడా తీవ్రంగానే పరిశీలిస్తున్నారు అని అంటున్నారు.

### డీఎంకేకి ఆహ్వానం :

ఇదిలా ఉంటే తమిళనాడులో విజయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు అన్నీ ఒక వేదికగా ఏర్పడాలని మాజీ సీఎం పళని స్వామి అంటున్నారు. ప్రజల కోసం అవసరం అయితే డీఎంకే అధినేత స్టాలిన్ తో చేతులు కలిపేందుకు కూడా సిద్ధమని పళని స్వామి ప్రకటించడం ఇపుడు రాజకీయంగా కాక పుట్టిస్తోంది. రెండు భిన్న పార్టీలు చిరకాల వైరం ఉన్న పార్టీలు ఒక్కటి అవుతామని చెప్పడం చూస్తుంటే విజయ్ ప్రభావం తమిళనాడులో ఎంతగా ఉందో అర్థం అవుతోంది అని అంటున్నారు. ప్రజా సమస్యలు అని బయటకు చెబుతున్నా రాజకీయ అస్తిత్వం కోసమే ఈ విధంగా చేతులు కలపాలని కోరుకుంటున్నారు అని విశ్లేషణలు ఉన్నాయి. టీవీ కేకు వ్యతిరేకంగా తాము ఏర్పాటు చేయబోయే కూటమిలోకి డీఎంకే వస్తే స్వాగతిస్తామని పళని స్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు.

### అసెంబ్లీలో పోరు :

ఇక రాష్ట్ర శాసనసభలో డీఎంకే ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. ఆ తరువాత ప్లేస్ లో పళనిస్వామి నాయకత్వంలో అన్నా డీఎంకే ఉంది. అధికార టీవీకే నిరంతరం ద్రవిడ పార్టీలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోంది. డీఎంకే ప్రభుత్వం అవినీతి మీద కూడా ముఖ్యమంత్రి విజయ్ లేటెస్ట్ గా చేసిన విమర్శలు సభను ఒక్కసారిగా వేడెక్కించాయి. దాంతో డీఎంకే ఎమ్మెల్యేలు సభలోనే నిరసన తెలిపారు. ఇలా ఢీ అంటే ఢీగా సాగుతున్న తమిళ రాజకీయంలో విజయ్ ని పక్కన పెట్టేందుకు స్టాలిన్ పళని స్వామి చేతులు కలుపుతారా అన్నదే చర్చగా ఉంది. రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చు అన్నది ఉంది. ఇపుడు రెండు ద్రవిడ పార్టీల అస్థిత్వానికే ముప్పు వాట

# కాంగ్రెస్ మైండ్ గేమ్ లో గులాబీ దళం




నల్గొండ, వంద కాదు, ఐదువందలు కాదు.. ఏకంగా వెయ్యి రోజుల కాంగ్రెస్ మార్క్ పాలనపై అసెంబ్లీ సాక్షిగా 'ఛార్జ్‌షీట్' దాఖలు చేసి, రేవంత్ ప్రభుత్వాన్ని కడిగిపారేద్దామని గులాబీ బాస్‌లు పక్కా స్కెచ్ వేశారు. నల్ల చొక్కాలు తొడిగి, చేతిలో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ గేటు ముందు కేటీఆర్, హరీశ్‌రావులు దిగిన సీన్ చూసి.. ఇక ఈ వర్షాకాల సమావేశాల్లో 'హైవోల్టేజ్ డ్రామా' ఖాయం, కాంగ్రెస్ వికెట్ పడిపోవడం తథ్యం అని ప్రతిపక్ష శ్రేణులు తెగ మురిసిపోయాయి. తీరా కట్ చేస్తే.. అసలు కథ వేరేలా మారింది!ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల బాకీల గురించి గళమెత్తాల్సిన చోట.. 'తాతా మధు' నోటి దురద పుణ్యమా అని కథ మొత్తం రివర్స్ తిరిగింది. పోలీసులతో తోపులాటలో ఆవేశం ఆపుకోలేక ఎమ్మెల్సీ గారు విసిరిన ఒక్క మాటతో.. కాంగ్రెస్‌కి బిగ్ ఆఫర్ దొరికినట్లయింది. "దళిత స్పీకర్‌ను అవమానిస్తారా?" అంటూ హస్తం నేతలు సెంటిమెంట్ కార్డు తీసి జనం మీదికి వదిలారు. ఇక అంతే! సభలో స్పీకర్ గారు కన్నీళ్లు పెట్టుకోవడం, కాంగ్రెస్ నేతలు 'దళిత ఆత్మగౌరవం' అంటూ రచ్చ చేయడం.. దీంతో బీఆర్ఎస్ తెచ్చిన 'వెయ్యి రోజుల వైఫల్యాల' అజెండా గాల్లో కలిసిపోయింది. ప్రభుత్వాన్ని కార్నర్ చేయాల్సిన గులాబీ నేతలు, చివరికి తమ నేత నోటిజారుడుకు సఫాయిలు చెప్పుకోవాల్సిన దయనీయ స్థితికి పడిపోయారు.రెండో రోజు సీన్ ఇంకా రసవత్తరంగా మారింది. అర్థరాత్రి అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు డిమాండ్లు.. ఇలా సీన్ మొత్తం బీఆర్ఎస్ నేతలకు ఊపిరాడకుండా చేసింది. ఇక సీఎం రేవంత్‌పై కేటీఆర్ గారు పెంచిన "డోస్" ఏమైనా వర్కవుట్ అయిందా అంటే.. అదీ లేదు! ప్రత్యర్థిని దెబ్బకొట్టబోయి తామే మరింత ఆవేశపడి, కాంగ్రెస్ నేతల చేతికి మరో ఆయుధాన్ని అందించారు.మరోవైపు, షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం బీఆర్ఎస్‌కు పక్కా "గోల్డెన్ ఛాన్స్". దాన్ని పట్టుకుని జనాల్లో సానుభూతి పిండుకోవాల్సిన చోట.. కేటీఆర్ కంపెనీ ఆవేశంలో ఊగిపోయి ఆ అవకాశాన్ని నీళ్లపాలు చేసుకుంది.మొత్తానికి 'ఛార్జ్‌షీట్' పట్టుకుని కాంగ్రెస్‌ను కడిగేద్దామని వచ్చిన బీఆర్ఎస్.. చివరకు స్టేషన్ల చుట్టూ, కేసుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకుంది. ప్రత్యర్థిని ఆవేశంలో ముంచి తప్పు చేయించడంలో కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్ వర్కవుట్ అయితే.. ఉన్న అవకాశాలను వదిలేసుకుని గులాబీ దళం భలే 'సెల్ఫ్‌గోల్' వేసుకుందంటూ రాజకీయ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు!

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140